క్లుప్తంగా

ఉచిత కంటి పరీక్షలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఆర్‌బీఎస్‌కేల ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 250 మందికి పరీక్షలు చేయగా తొమ్మిది మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అజ్మల్‌ఖాన్, వైద్యుడు మారుతి బాబు, కంటి వైద్య నిపుణులు హరికృష్ణారావు, ఆశ కార్యకర్తలు అనురాధ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సన్నరకం ధాన్యం పరిశీలించే మిషన్ల అందజేత



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల కార్యదర్శులకు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రజితారెడ్డి బుధవారం సన్నరకం ధాన్యం పరిశీలించే యంత్రాలు (క్యాలిపర్) మిషన్లు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకట్రాంరెడ్డి తదితరులున్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి



ఎల్లారెడ్డి: గ్రామాలలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. బుధవారం మిషన్ భగీరథ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ.. ఇటీవల గ్రామాలలో నీటి సమస్య తీర్చేందుకు బోర్లు వేసినట్లు తెలిపారు. నీటి ఇబ్బందులు లేకుండా వాటిలో బోరు మోటార్లు ఏర్పాటు చేయాలని అన్నారు. మిషన్ భగీరథ అధికారులు తదితరులున్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కబడ్డీ పోటీల అబ్జర్వర్‌గా నగేష్



కామారెడ్డి అర్బన్: రాష్ట్రస్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -17 బాలుర కబడ్డీ పోటీలకు బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాల పీఈటీ సింహాల నగేష్‌ను పరిశీలకులుగా నియమించారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే.రాంరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. నగేష్‌ను అబ్జర్వర్‌గా నియమించడంతో టీజీపేటా జిల్లా గౌరవ అధ్యక్షుడు సాయిమౌర్య,అధ్యక్షుడు హీరాలాల్,స్వామిగౌడ్, అశోక్‌లు అభినందనలు తెలిపారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు.

మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి



బాన్సువాడ: మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అన్నారు. బుధవారం పట్టణంలోని 1వ వార్డులో మురికి కాలువలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండడంతో దోమల బెడద తీవ్రమవుతుందని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. ప్రతీ ఒక్కరు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులను కోరారు. నీటిని వృథా చేయవద్దని అన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది హన్మండ్లు, సతీష్ ఉన్నారు.

నూతన రేషన్ షాపు ప్రారంభం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): నందివాడలో బుధవారం నూతనంగా మంజులైన రేషన్ షాపును తహసీల్దార్ రహిమొద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి వచ్చిన సరుకులను లబ్ధిదారులకు సక్రమంగా సరఫరా చేయాలని సూచించారు. ఆర్ఐ హారిక, రేషన్ డీలర్ రామస్వామి, స్వామిగౌడ్, బక్కగణేష్, భాస్కర్, నారాగౌడ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



మల్లుపేట్‌లో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో చందర్ నాయక్



నస్రుల్లాబాద్‌లో .. ఎంపీడీవో సూర్యకాంత్

సమగ్ర సర్వే ప్రారంభం

సాక్షి నెట్‌వర్క్:ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణ కోసం నిర్వహిస్తున్న సమగ్రజు సర్వే బుధవారం ప్రారంభమైంది. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు కోరారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా సర్వేను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. ఇళ్లను సందర్శించి కుటుంబ సర్వే నిర్వహణ కోసం స్టిక్కర్లను అతికించారు. ఇళ్లకు సర్వే కోసం వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు. కుటుంబ సభ్యులు దగ్గరుండి పూర్తి వివరాలను వెల్లడించాలని సూచించారు. దూర ప్రాంతాల్లో ఉండే వారు కూడా వచ్చి వివరాలు తెలపాలని అన్నారు. ఈ నెల 6 నుంచి 8 వరకు హౌజ్ లిస్టింగ్ ప్రక్రియ జరుగుతుందని, 9న సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభమవుతుందన్నారు.



నర్సన్నపల్లిలో ఇళ్లకు స్టిక్కర్లను అతికిస్తూ..



బంజపల్లిలో .. ఎంపీడీవో గంగాధర్



బేగంపూర్‌లో.. ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి



పెద్దాయిపల్లిలో సర్వే చేపడుతున్న ఎన్యుమరేటర్లు



లింగంపేటలో .. ఎంపీడీవో నరేష్



ఎల్లారెడ్డిలో..



గాంధారిలో .. ఎంపీడీవో రాజేశ్వర్



తాడ్వాయిలో .. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ



బాన్సువాడ పట్టణంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్



బస్వాపూర్‌లో.. తహసీల్దార్ శివప్రసాద్



బోర్లంలో సర్వే తీరు పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ నాగేశ్వరరావు



నర్సింగ్‌రావ్ పల్లిలో ..

తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలి

కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్

మాచారెడ్డి: కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి జన్మనిచ్చిన తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు.బుధవారం మండలంలోని ఎల్లంపేట ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో నవ్వుతూ మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం సోమారంపేట ఉన్నత పాఠశాలతో పాటు రాజఖాన్‌పేట గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కేవీఆర్

గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందించాలని అంగన్‌వాడి టీచర్లను కోరారు. ఎమ్మెల్యే తనదైన శైలిలో ఎవరికి చెప్పకుండా సింగిల్‌గా వెళ్తూ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తూ ఆశ్చర్యానికి గురి చేశారు.

మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం సరికాదు

కామారెడ్డి రూరల్: మాలల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడిన బట్టు వెంకట రాములుపై కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజనర్సింలు తెలిపారు. బుధవారం కామారెడ్డిలో మాల మహానాడు జిల్లా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కంకణాల ఎడ్ల సుతారి సుధాకర్ మాట్లాడుతూ.. సోమవారం జరిగిన మాదిగ ధర్మ యుద్ధభేరి మహాసభలో మాలల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడిన మాచారెడ్డి మండలం ఫరీద్‌పేట గ్రామానికి చెందిన బట్టు వెంకట్ రాములు చర్యలు తీసుకోవాలని అన్నారు.'అంబేడ్కర్,గాంధీ కాలంలో అప్పటి అగ్రవర్ణాల కంటే ఇప్పటి మాలలే అత్యంత ప్రమాదకరం' అని మాల కులస్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం సరికాదని వెంటనే మాలలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు గోనుగుప్పుల లింగం, దుడ్డే రాజు.కంకణాల జగన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాలమహానాడు నేత నర్సింలు

బ్యాంకు సేవలపై అవగాహన

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం యూనియన్ బ్యాంకు సేవలపై బ్యాంకు అధికారులు అవగాహన కల్పించారు. బ్యాంకు లావాదేవీలు, ఖాతాలు, రుణాల చెల్లింపు, నగదు విత్‌డ్రాలపై విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. బ్యాంకు మేనేజర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని అశోక్‌నగర్, విద్యానగర్ ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహించనున్నందున నేటి(గురువారం) ఉదయం 10 గంటల నుంచి ఓ గంట పాటు విద్యుత్‌కు అంతరాయం కల్గుతుందని ఆపరేషన్ ఏఈ ఎస్.వెంకటేష్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చేప పిల్లల పంపిణీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో బుధవారం పలు గ్రామాల గంగపుత్ర సంఘాలకు చేప పిల్లలను పంపిణీ చేశారు. మండలానికి 43 వేల 275 చేప పిల్లలు వచ్చాయని, ఇప్పటికి 50 శాతం మాత్రమే చేప పిల్లలు వచ్చినట్లు గంగపుత్ర సంఘం అధ్యక్షుడు తోకల నరేందర్ తెలిపారు. తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్ కుమార్, గంగపుత్ర సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



భిక్కనూరు: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, కొనుగోళ్లు వేగవంతం చేయాలని భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన జంగంపల్లి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కాంటాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. విండో సీఈవో రమేష్ ఉన్నారు.

'బస్సు ఖాళీ లేదు.. వెనక బస్సులో రండి'



గాంధీనగర్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

లింగంపేట(ఎల్లారెడ్డి): బస్సు ఖాళీ లేదు వెనుక వచ్చే బస్సుల్లో రమ్మని చెబుతూ ఆపకుండా వెళ్తున్నారని గాంధీనగర్ గ్రామ మాజీ సర్పంచ్ భీంరావు అన్నారు. తర్వాత వచ్చిన బస్సులు సైతం ఓవర్‌లోడ్‌తో వస్తుండటంతో వారు కూడా అదే మాటలు చెబుతుండటం వల్ల విద్యార్థులు తరగతులు నష్టపోతున్నారని మండిపడ్డారు. బస్సులు ఆపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. ప్రతి రోజూ ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని బుధవారం లింగంపేట మండల గాంధీనగర్ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు రోడ్డుపై ధర్నా, రాస్తారోకో చేపట్టి నినాదాలు చేశారు. గంటల తరబడి బస్సు కోసం చూడాల్సి వస్తుందని వాపోయారు. నెలల తరబడి రోజూ బస్సులు ఆపకపోవడంతో విసుగు చెంది రాస్తారోకో చేశామని పేర్కొన్నారు. గాంధీనగర్, ఎల్లమ్మ తండా, బూరుగిద్ద గ్రామాలకు చెందిన విద్యార్థుల పరిస్థితి అలాగే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, గ్రామస్తులు ధర్నా, రాస్తారోకోలో పాల్గొన్నారు. గంట పాటు రాస్తారోకో చేయడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.

శ్మశానవాటిక దారి కోసం స్థల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మకూర్ శ్మశానవాటికకు వెళ్లేందుకు అవసరమైన స్థలాన్ని బుధవారం స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌రావు గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. కొంతకాలంగా శ్మశానవాటికకు దారి లేకపోవడం వల్ల గ్రామంలో ఎవరైనా చనిపోయిన సమయంలో వారి అంత్యక్రియల నిర్వహణ కోసం కుటుంబసభ్యులు, బంధువులు అనేక అవస్థలు పడేవారు. ఈ విషయమై గ్రామస్తులు పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ గ్రామానికి చేరుకొని స్థలాన్ని పరిశీలించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డితోపాటు ఇతర గ్రామస్తులతో ఆయన చర్చించారు. గ్రామస్తులంతా కలిసి ఒక నిర్ణయానికి రావాలని ఆయన సూచించారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రావు

సరస్వతి దేవి ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న రమాదేవి-హరిబాబు దంపతులు

కామారెడ్డి రూరల్: టేక్రియాల్ ప్రాథమిక పాఠశాలలో సరస్వతి మాత విగ్రహ ప్రతిష్ఠ సప్తమ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ దాతలు రిటైర్డ్ ఎల్‌ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు రమాదేవి-హరిబాబు దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శంకర్‌రావు మాట్లాడుతూ.. పదవీ విరమణ పొంది 7 యేళ్లు పూర్తయినప్పటికీ ప్రతి యేడాది టేక్రియాల్‌కు వచ్చి రమాదేవి-హరిబాబు దంపతులు సరస్వతీ దేవి వార్షికోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి యేడాది గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికి నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. హెచ్ఎం శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): రైతులు పంట చేన్లలోని మోటార్లకు కెపాసిటర్లను బిగించుకోవాలని ఎల్లారెడ్డి డీఈ విజయసారథి సూచించారు. బుధవారం ఆయన లింగంపేట శివారులో ఏర్పాటు చేసిన పొలం బాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులు లూజు లైన్ తీగలు, వంగిన పోల్స్ పంట చేలల్లో ఉంటే లైన్‌మన్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే రైతులు నేరుగా ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు వేసుకోవద్దన్నారు. లైన్‌మన్ ద్వారానే కరెంటు పనులు చేయించుకోవాలని సూచించారు. ఏడీఈ మల్లేష్, ఏఈ సాయినాథ్, సబ్‌ఇంజినీరు భాస్కర్, లైన్‌మన్ వాహెద్, రాజాగౌడ్, లక్ష్మీనారాయణ, ఏఎల్ఎం ఆదిరెడ్డి, మల్లయ్య, సీఎల్ రాజు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ట్రాన్స్‌కో అధికారులు

మద్య నిషేధంపై ఏకగ్రీవ తీర్మానం



బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామస్తులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లిలో మద్య నిషేధంపై బుధవారం గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామంలో మద్యం విక్రయించరాదని అన్ని కులాల సభ్యులు నిర్ణయించుకున్నారు. గ్రామంలో మద్యం ఎవరైనా అమ్మితే రూ.లక్ష జరిమానా విధిస్తూ పట్టించిన వారికి రూ.20 వేల పారితోషికం అందిస్తామని వెల్లడించారు. గ్రామంలో మద్యం విక్రయించడం వల్ల యువత పెడదారి పడుతోందని మండల కేంద్రానికి వెళ్లి తెచ్చుకుని తాగాలంటే ఇబ్బందిగా ఉంటుందని, ప్రజల్లో మార్పు వస్తుందన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. గ్రామస్తులు పవన్ గౌడ్, అన్నం సత్యనారాయణ, నిజ్జిని సాయిలు, బాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ గ్రామాల పరిధిలోని గ్రామాల్లో పచ్చని చెట్లు గొడ్డలి వేటుకు బలవుతున్నాయి. పంట చేన్లు, చెరువు గట్లు, కట్టలపై ఉన్న చెట్లను దళారులు కొనుగోలు చేస్తూ నరికేస్తున్నారు. పట్టా భూముల్లో, ప్రభుత్వ ప్రదేశాల్లో ఉన్న చెట్ల నరికివేతకు గ్రామ పంచాయతీ, రెవెన్యూ, అటవీశాఖల అనుమతులు తప్పనిసరి. కాని గ్రామాల్లో ఉన్న నీలగిరి, వేప, తుమ్మ, మామిడి చెట్లను వ్యాపారులు కొనుగోలు చేస్తూ నరికి వేస్తున్నారు. గ్రామాల్లో నరికి వేస్తున్న చెట్లను ఇటుక బట్టీలు, సామిల్లులకు తరలిస్తూ డబ్బులు సంపాదిస్తున్నారు. గ్రామాల్లో అక్రమంగా చెట్ల నరికివేతపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మహమ్మద్‌నగర్‌లో నిల్వచేసిన నీలగిరి కలప

సంక్షిప్తం

చట్టాలపై అవగాహన



కామారెడ్డి అర్బన్: విద్యార్థులు సమాచార హక్కు చట్టంతో పాటు కొత్తగా అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. బుధవారం స్థానిక డెయిరీ టెక్నాలజీ కళాశాలలో స.హ చట్టం, ఇతర చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు వివిధ చట్టాలపై వివరించి వారి సందేహాలకు సమాధానాలిచ్చారు. డెయిరీ కళాశాల ప్రిన్సిపాల్ ఉమాపతి, స.హ.చట్ట పరిరక్షణ కమిటీ ప్రతినిధులు ఈక శ్రీనివాస్‌రావు, అశోక్, ఎస్.నవనీత, కాసర్ల లింగం పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

మాచారెడ్డి: రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ రావు సూచించారు. మండలంలోని కాకులగుట్ట తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. దళారులకు నమ్మి మోసపోవద్దన్నారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణ, నాయకులు శంకర్ నాయక్, తిరుపతి, రవీందర్, రవి, జబ్బార్, నరేష్, ప్రకాశ్, భాస్కర్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): లింగంపల్లి గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ గంగాసాగర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. తేమ శాతం పరిశీలించిన తర్వాతనే తూకం చేయాలని సూచించారు. ఏవో ప్రజాపతి, మాజీ ఉప సర్పంచ్ దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.



సీపీపీ నిలుపుదల చేయడం హర్షణీయం

కామారెడ్డి అర్బన్: ఉద్యోగ విరమణ పొంది 11 సంవత్సరాల 3 నెలలు దాటిన పెన్షనర్ల కమ్యూటెడ్ వాల్యూడ్ పెన్షన్(సీవీపీ) నిలుపుదల చేయాలని ట్రెజరీ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాలు జారీ చేయడాన్ని హర్షిస్తున్నామని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారుడు జి.లచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆదేశాల ప్రకారం హైకోర్టు ఉత్తర్వులు తీసుకున్న వారికే సీవీపీ నిలుపుదల వర్తింప చేస్తునందున, లబ్ధి పొందాలనుకునే పెన్షనర్లు కోర్టుకు వెళ్లాలని లచ్చయ్య సూచించారు.